ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



8

నిర్మల్
జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

నేడు ఉద్యోగ మేళా

నిర్మల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం (సెమినార్ హాల్)లో ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా (ప్రైవేట్ ఉద్యోగాలు) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి గోవింద్ తెలిపారు. జాబ్ మేళాకు వచ్చేటప్పుడు ఎంప్లాయిమెంట్ కార్డు తప్పనిసరి తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 91546 79103, 96424 25265 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

- నేడు నూతన ఆలయంలో అడెల్లి మహా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన
- కృష్ణ శిలలతో భక్తులను కనువిందు చేస్తున్న ఆలయం

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే!

నిర్మల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పవల్లిగా, జిల్లా ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అడెల్లి మహా పోచమ్మ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠతో ముగుస్తాయి. ఈ ఐదు రోజుల పాటు నిర్వహించిన పూజాది కార్యక్రమాల్లో ప్రముఖ వేద పండితులు గురు మంచి చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో దాదాపు 25 మంది పూజారులు పాల్గొన్నారు. పునఃప్రతిష్ఠాపనలో అడెల్లి ఆలయం పలు విశేషాలను సంతరించుకుంది. ప్రధానంగా ఆలయ గర్భగుడి, అర్ధమండపాన్ని కృష్ణ శిలతో, ప్రాచీన రూపులో నిర్మించడం విశేషం.

తమిళనాడు నుంచి..

అడెల్లి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ 2023లో ప్రారంభమైంది. అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచన మేరకు అమ్మవారి గుర్భగుడిని కృష్ణ శిలలతో నిర్మించాలని నిర్ణయించారు. ఆలయ నిర్మాణ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న నిర్మల్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్ రెడ్డి జిల్లాలో తొలిసారి కృష్ణ శిలతో జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయాన్ని నిర్మించారు. ఇదే అనుభవంతో అడెల్లిలోనూ అద్భుత మైన ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. 2024లో ఏడాది కాలంలో నిర్మాణ పనులు పూర్తి చేశారు. గర్భగుడి, అర్ధమండపాన్ని నిర్మించేందుకు తమిళనాడు నుంచి నల్ల రంగులో ఉండే కృష్ణ శిలలను తెప్పించారు. శిల్పి వెంకటేశన్ ఆధ్వర్యంలో ఇక్కడే శిల్పాలను, ఆకృతులను చెక్కి ఆలయంగా మలిచారు.

ఏళ్లపాటు నిలిచేలా..

ఎప్పుడో వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇందుకు కారణంగా వాటిలో ఎక్కడ కూడా సిమెంటు, ఇటుక వంటివి వాడకుండా కేవలం రాళ్లతోనే నిర్మాణాలను చేపట్టడం, ఇప్పటికీ ప్రసిద్ధి చెందిన చాలా ఆలయాలు కృష్ణ శిలలతోనే నిర్మిస్తున్నారు. ఈ శిల మృదువుగా, చెక్క దానికి మెత్తగా ఉంటుంది. ఫినిషింగ్ కూడా చెక్కుచెదరకుండా వస్తుంది. అలాగే వందల ఏళ్లపాటు నిలిచి ఉండే మన్నిక ఈ రాయిలో ఉంటుందని కాంట్రాక్టర్ జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారు. సిమెంట్ నిర్మాణంతో పోలిస్తే, కృష్ణ శిలలతో నిర్మాణం చాలా వ్యయంతో కూడుకుని ఉంటుంది. అడెల్లి ఆలయాన్ని రూ. 6 కోట్ల 60 లక్షలతో నిర్మించారు.

విశాలమైన మండపం..

ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి అడెల్లి పోచమ్మ వద్దకు భక్తులు భారీగా వస్తుంటారు. ప్రతీ ఆదివారం అమ్మవారి సన్నిధి వేలాది మంది భక్తులతో నిండిపోతుంది. ఈ నేపథ్యంలోనే నూతన ఆలయాన్ని విశాలంగా నిర్మించారు. ఒకేసారి వందల సంఖ్యలో భక్తులు దర్శించుకునేలా మండప నిర్మాణం చేపట్టారు. గర్భగుడి, అర్ధమండపాన్ని విశాలంగానే నిర్మించారు.



అడెల్లి పోచమ్మ విగ్రహం



నూతనంగా నిర్మించిన అడెల్లి పోచమ్మ ఆలయం ఇదే

పూర్వజన్మ సుకృతం..

- లక్కడి జగన్మోహన్ రెడ్డి, ఆలయ నిర్మాణ కాంట్రాక్టర్



నిర్మల్‌లోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయాన్ని తొలిసారి కృష్ణ శిలలతో నిర్మించాం. ఆ అమ్మవారి ఆశీస్సులతో అడెల్లి పోచమ్మ ఆలయాన్ని కట్టే అదృష్టం దక్కింది. అలాగే ఈ ఆలయాన్ని కృష్ణ శిలలతోనే నిర్మాణం చేపట్టాం. ఆలయ నిర్మాణ సమయంలోనే వివిధ జిల్లాలు, మహారాష్ట్ర నుంచి చాలా మంది వచ్చి సందర్శించారు. అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.



తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్ రైతుల నిరసన

నర్సాపూర్(జి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోలు నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ మండల రైతులు గురువారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా రైతులు రాస్తారోకోకు ప్రయత్నించగా ఎస్సై గణేష్ అనుమతికి నిరాకరించారు. దీంతో రైతులు తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద నిమిషం పాటు నినాదాలు చేశారు. భారీ వర్షాల నష్టం దృష్ట్యా కొనుగోలు పరిమితిని ఎకరాకు 7 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లకు పెంచాలి. అలాగే కిసాన్ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిందే దీక్షిత్ పటేల్, మండల కన్వీనర్ తోడిశెట్టి సుదన్‌తో పాటు కుమ్మరి భాస్కర్, జి. పోశెట్టి, నాకిడి లక్ష్మణ్, మేదరి లక్ష్మణ్, దేవిదాస్, నాగరావు, వెంకట్రావు, విజయ్, బర్కుంట రాము, ఎలిశెట్టి నరేందర్, ఎల్‌సీడీ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల పండుగ

కుబీర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర వాసులు మరో పండరిపురంగా కొలిచే విఠలేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉట్ల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారితో ఉట్టి పగటగొట్టి అందులోని ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పలు సాంస్కృతిక కార్యక్రమాలు భవజనాలు చేస్తూ శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు పోచమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన



సారంగపూర్‌లో పునః ప్రతిష్ఠాపనకు ముస్తాబైన అడెల్లి ఆలయం

సారంగాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో మహా ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం ఉదయం 8 గంటలకు వేద పండితులు వేద మంత్రాలను చదువుతూ ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, ఆలయ ఇంచార్జీ ఈవో భూమన్నలు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి సేవలో పాల్గొనాలని కోరారు.

అన్ని ఏర్పాట్లు చేసాం

విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు వచ్చి హాజరయ్యే భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొకుకుండా ఉండడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పునః విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరుకానున్న బీజేఎల్పీ నేత ఏలేటీ

అడెల్లి మహాపోచమ్మ పునః విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

చివరి దశలో సదర్‌మాట్

యాసంగికి సిద్ధంగా నూతన బ్యారేజీ

- నీటి నిల్వ కోసం ఎన్‌డీఎస్‌ఏకు లేఖ
- సమాయత్తవుతున్న ఇరిగేషన్ శాఖ
- ముగుస్తున్న ఎలక్ట్రిఫికేషన్ పనులు
- 18వేల ఎకరాలకు అదనంగా సాగునీరు



పొన్కల్ గ్రామం సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ఇదే

నిర్మల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొన్కల్ వద్ద నిర్మిస్తున్న సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. రాబోయే యాసంగి పంటలకు ఈ బ్యారేజీ నుంచి సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు మొదలుపెట్టారు. ప్రధానంగా నేషనల్ డ్యామ్ సెఫ్టీ ఆథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కు ఇరిగేషన్ శాఖ అధికారులు రాసిన లేఖ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గోదావరి నది నుంచి వచ్చే నీటిని సదర్‌మాట్ బ్యారేజీ వద్ద నిలుపుదల చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఎన్‌డీఎస్‌ఏ అనుమతిని కోరుతూ లేఖను రాశారు. యాసంగికి ముందుగానే ఎన్‌డీఎస్‌ఏ సదర్‌మాట్ బ్యారేజీ వద్ద నీటిని నిల్వ చేసేందుకు అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయని ఇరిగేషన్ శాఖ అధికారులు ధీమాతో ఉన్నారు. ఇప్పటికే సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణ పనులన్నీ చివరి దశలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం 14 కోట్లతో చేపట్టిన విద్యుత్ సౌకర్యానికి సంబంధించిన పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి. డిసెంబరు వరకు ఎలక్ట్రిఫికేషన్ పనులన్నీ పూర్తి కానున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ నుంచి అనుమతులు రాగానే నిల్వ చేసిన గోదావరి నీటిని ఈ బ్యారేజీ ద్వారా యాసంగి పంటల కోసం సాగునీటిని అందించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్మల్, జగిత్యాల జిల్లాలోని మొత్తం 18 వేల ఎకరాలకు ఈ బ్యారేజీ ద్వారా సాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో మరో 5వేల ఎకరాలకు ఈ బ్యారేజీ ద్వారా సాగునీరును అందించాలని లక్ష్యంగా నిర్ధారించారు.

చివరి దశలో నిర్మాణ పనులు

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే బ్యారేజీ నిర్మాణ పనులన్నీ పూర్తి కాగా ప్రస్తుతం ఎలక్ట్రిఫికేషన్ పనులు చివరి దశలో ఉన్నాయి. మొత్తం బ్యారేజీని 676 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఇందులో నుంచి ఇప్పటి వరకు రూ. 374 కోట్లతో అగ్రిమెంట్ జరిగింది. 1170 ఎకరాల భూమిని సేకరించి దీని కోసం గానూ 120 కోట్లను భూములు కోల్పోయిన వారికి పరిహారంగా చెల్లించారు. దాదాపు ఏడాది క్రితం బ్యారేజీ పనులన్నీ పూర్తి కాగా గేట్లకు సంబంధించి మొదట అంచనాలపై కాంట్రాక్టర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం గేట్ల నిర్మాణానికి సంబంధించి అదనపు నిధులను కేటాయించింది. కాగా ఎలక్ట్రిఫికేషన్ పనులకు సంబంధించి ప్రతిపాదించిన రూ. 14 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆలస్యంగా మంజూరు చేయడంతో పనులు స్తంభించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో ఎలక్ట్రిఫికేషన్ పనులకు సంబంధించిన రూ. 14 కోట్లను విడుదల చేసింది. దీంతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం డిసెంబర్ నెలాఖరు వరకు ఎలక్ట్రిఫికేషన్ పనులన్నీ పూర్తి కాబోతున్న కారణంగా రాబోయే యాసంగి పంటలకు సదర్‌మాట్ నీరు అందబోతుండడం రైతాంగానికి శుభవార్తగా పేర్కొంటున్నారు.

యాసంగి పంటలకు సాగు నీరందిస్తాం..

● రాథోడ్ సురేందర్, డీఈ, సదర్మాట్



రాబోయే యాసంగి పంటలకు సాగునీరు అందిస్తాం. బ్యారేజీ ద్వారా నిర్మల్, జగిత్యాల జిల్లాలోని మొత్తం 18 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద విద్యుత్ సౌకర్యం కోసం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్యారేజీ వద్ద నీటి నిలుపుదల అనుమతి కోసం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాశాం. అనుమతులు రాగానే బ్యారేజీ వద్ద ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిని నిలుపుదల చేస్తాం. ఈ సదర్మాట్ బ్యారేజీ వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

బ్యారేజీతో పంటలకు నీరు అందుతుంది..

● ఆర్. నర్సారెడ్డి, పొన్కల్ గ్రామం



సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం అయిన నుంచి మా పంట లకు గ్రౌండ్ వాటర్ పెరగడంతో నీరు అధికంగా అందుతుంది. పంటలు బాగా పండి మాకు లాభదాయకంగా ఉంది. ఒకప్పుడు గోదావరి నుంచి పైపు లైన్ వేసుకొని నీరు పారించే వాళ్లం. ఇప్పుడు బోర్లతో పంట సాగుకు నీరు అందిస్తున్నాం.

చిన్న నీటి పారుదల గణాంక ప్రక్రియ

పకడ్బందీగా నిర్వహించాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్న నీటి పారుదల గణాంక వివరాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 7వ చిన్న నీటి పారుదల గణాంక నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న నీటిపారుదల కింద వచ్చే సహజ, మానవ నిర్మిత బోర్లు, బావులు, చెరువులు, కుంటలు, కాలువలు, తదితర వివరాలన్నింటినీ పకడ్బందీగా సేకరించాలన్నారు. ఈ సర్వే నిర్వహణ కోసం గ్రామీణ స్థాయిలో జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులను ఎన్యుమరేటర్లుగా నియమించాలన్నారు. వివరాల నమోదుకు సంబంధించి నిర్దేశించిన అప్లికేషన్ గురించి సర్వే అధికారులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని వివరించారు. చిన్న నీటిపారుదల వివరాలన్నింటిని ఖచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు ప్రభుత్వాలకు పాలసీలు రూపొందించడంలో తోడ్పడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా ప్రణాళిక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న విజయాన్ని సాధిస్తాం

» దర్శనం భోజన్న, డీఈవో



బి.తేజశ్రీని అభినందిస్తున్న డీఈవో

సోన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సొంతమవుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. సోన్ మండలం పాక్‌పట్ల ఉన్నత పాఠశాలను గురువారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపుల వారీగా విభజించి ముఖ్యంగా సి గ్రూప్ విద్యార్థులకు ప్రత్యేక బోధన చేయాలన్నారు. పాఠ్యాంశం పూర్తి కాగానే అభ్యాస దీపికల్లోని ప్రశ్నలను అభ్యాసం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పనికిరాని వస్తువులతో కళారూపాలను తయారు చేస్తున్న 9వ తరగతి విద్యార్థిని బి. తేజశ్రీని డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకన్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం

» జాతరకు భారీగా తరలివచ్చిన భక్తజనం



జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



విజేతకు లడ్డును బహుకరిస్తున్న ఆలయ కమిటీ బృందం

ఖానాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీలో గల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. ఆలయ 41వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతర మహోత్సవానికి నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి వారి రథాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ శోభాయాత్రలో వేలాదిగా పాల్గొన్న భక్తుల గోవింద నామస్మరణతో పట్టణ పుర వీధులన్నీ మార్మోగాయి. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద చిన్న పిల్లలు, మహిళల సందడి కనిపించింది. వేద పండితులు చక్రపాణి నరసింహా మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపోత్సవం, స్వామివారి లడ్డూ ప్రసాద లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఉదయం యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించిన వేద పండితులు రాత్రి స్వామివారి ఏకాంతోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో మాజీ మున్సిపల్ చైర్మన్లు చిన్నం సత్యనారాయణ, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కడార్ల గంగ నర్సయ్య, కల్వకుంట్ల నారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, కోశాధికారి ఊషకోల సుధాకర్, సభ్యులు తుమ్మనపల్లి లక్ష్మణ్, లింగాల రాము, రామ్ చిన్న భీమన్న, వెన్నం, అంజయ్య, లింగాల లక్ష్మణ్, నడిమెట్ల రమేష్ తదితరులున్నారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో



దిలావర్‌పూర్ ప్రాథమిక సహకార సంఘం వద్ద విద్యార్థులతో డీఐఈవో

దిలావర్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఏఅండ్‌టీ ఒకేషనల్ విద్యార్థులకు నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు వృత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులు స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు సహకార సంఘాల్లో ఖాతా పుస్తకాలను నిర్వహించే విధానాన్ని ప్రత్యక్షంగా చూసి, ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందారు. పుస్తకాల నిర్వహణ, లావాదేవీల నమోదు వంటి అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురామ్ ఈ శిక్షణ శిబిరాన్ని ఆకస్మాత్తుగా సందర్శించి, శిక్షణ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, శిక్షణ ద్వారా పొందుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తరహా వృత్తి శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నిర్మల్ జిల్లా వాసులు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంచిర్యాలలో జరిగిన అండర్ - 14, అండర్- 17 కరాటే పోటీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందులో అండర్- 14 క్యాటగిరీలో ఫాసియుద్దీన్ (ఆల్ఫోర్స్ స్కూల్), నరసింహ (సెయింట్ థామస్ స్కూల్), చరణ్ తేజ్, జోయా (విన్నర్స్ స్కూల్) అండర్- 17లో సిరిపురం హారతి (వాగ్దేవి స్కూల్, రిశ్విత్ (వాసవి స్కూల్), శ్రీనివాస్‌లు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కరాటే అధ్యక్షుడు తేజేందర్ సింగ్, చందుల స్వామి, భూషణ్, ఆర్గనైజర్ శ్రీకాంత్ తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో నరేంద్రచార్య మహరాజ్ రథయాత్ర

బాసర , నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో నరేంద్రచార్య మహరాజ్ రథయాత్ర గురువారం అంగరంగ వైభవంగా కొనసాగింది. సాంప్రదాయ సేవ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

శోభాయాత్ర..

భాజా భజంత్రీల నడుమ రథయాత్ర బాసర పురవీధుల గుండా అత్యంత శోభాయమానంగా ముందుకు సాగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు బారులు తీరి పాదుక దర్శనం చేసుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. రథయాత్రలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామానందచార్య స్వామిజీకి భక్తులు ప్రత్యేక పూల దండలతో స్వాగతం పలికి, వారి ఆశీర్వచనాలు అందుకున్నారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు



కప్పర్ల వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీ

కేంద్రం నిధులతో విశాలమైన రోడ్ల నిర్మాణం

» ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్

తాంసి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నిధులతో ప్రతీ పల్లెకు విశాలమైన రోడ్లు నిర్మిస్తున్నామని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన ఆయన రాంపూర్ ఎక్స్ రోడ్ నుంచి కరంజి వరకు గల అంతర్ రాష్ట్ర రహదారిని పరిశీలించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం జరుగుతుందని నాణ్యత లోపం లేకుండా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పనులను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బిజెపి పార్టీ నాయకులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న డిమాండ్ చేశారు. దినసరి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై గురువారం ఉట్నూర్ సర్వే చేసినట్లు చెప్పారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్‌లలో సర్వే నిర్వహించామన్నారు. ఆశ్రమ పాఠశాలల హాస్టల్లో పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. లక్షెట్‌పేట్, యెందా, నర్సాపూర్, సాలెగూడ, హస్నాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్లో సర్వే చేసి సమస్యలు తెలుసుకున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో హాస్టల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులకు గత ఆరు నెలల నుంచి పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆర్కవెంకట్రావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

ఇంద్రవెల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తమ్ అన్నారు. గురువారం మండలంలోని ఏమైయికుంట గ్రామంలోని విజయలక్ష్మి జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీవో నరేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోండుగూడ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

ఉట్నూర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని గోండుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రధాన పోస్ట్ ఆఫీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ని, ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం జాదవ్‌ప్రకాష్ ఉపాధ్యాయుడు కుంరశ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

బోథ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరత్వాడలో గ్రామస్థులు అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందుకొచ్చారు. వారంతా స్థానిక తహసీల్దార్ సుభాష్‌చంద్రకు విషయం వివరించారు. దీంతో ఆర్ఐ సునితను స్థలాన్ని పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ముందుకు వచ్చిన గ్రామ మహిళల చైతన్యాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు చంటి అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలి

ఉట్నూర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్‌ని ఉట్నూర్ మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు పంద్రాజైవంత్‌రావు, బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ధరణి రాజేశ్ మాట్లాడుతూ ఉట్నూర్ మండల కేంద్రంలో గల కేబీ ప్రాంగణంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో గత వారం రోజుల నుంచి పురుగులు ఉన్న ఆహారం, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారని అన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అందించకుండా విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. అక్కడున్న సిబ్బంది నెయ్యితో చపాతీలు చేసుకుని



యువరాజ్ మర్మాట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

తింటూ, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని సస్పెండ్ చేసి విద్యార్థులకు సరైనపౌష్టికాహారం అందించాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్‌ని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కోలాసత్తన్న, దూట మహేందర్, మహమ్మద్‌ముజీబ్, క్రాంతికుమార్, అజ్మీరాజయచంద్ర, సాజిద్‌సిద్దికి, పోన్నం సాయికుమార్, కోటేష్, బొడ్డునరేష్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్చోడ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాణి జిన్నింగ్ కేంద్రంలో గురువారం సీసీఐ పత్తి కొనుగోళ్లను ఇచ్చోడ మార్కెట్ చైర్‌పర్సన్ కుమ్రం సత్యవతి ప్రారంభించారు. అనంతరం అధికారులు, రైతులతో కలిసి జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. రైతులు తమ పంటను ప్రైవేటు వ్యక్తులకు అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి పంటను విక్రయించుకోవాలన్నారు. అనంతరం పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ జాదవ్, మండల వ్యవసాయ అధికారి తిరుమల, మార్కెట్ కార్యదర్శి ఆస్మాసుల్తానా, మార్కెట్ సూపర్‌వైజర్ ఖాజా ఇసాకొద్దిన్, నాయకులు కుమ్రం కోటేశ్వర్, లక్ష్మణ్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఇంద్రవెల్లి,నవంబరు6(ఆంధ్రజ్యోతి): వైద్యులతోపాటు వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రిజిస్టర్, రికార్డులు, సిబ్బంది పని తీరును వైద్యురాలు పూజితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్యమిషన్‌లో రోజువారీగా ఆరోగ్యవివరాలు పొందుపర్చాలన్నారు. ఆరోగ్య కేంద్రాలతోపాటు ఉపకేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వసంతరావు, డాక్టర్ పూజిత, హెల్త్‌సూపర్ వైజర్ పవార్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి తన రక్తం గ్రూపును తెలుసుకుని ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని డాక్టర్ ఖలీల్ అన్నారు. గురువారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త పరీక్ష శిబిరంలో సుమారు 60 మందికి రక్తపరీక్షలు చేశారు. ఆరోగ్యవంతమైన వారు తమ రక్తాన్ని 6 నెలలకు ఒకసారి దానం చేయవచ్చని అన్నారు. రక్తదానంతో ప్రాణాలు కాపాడే వీలుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి భోజారెడ్డి, అల్లం సాయికుమార్, అల్లం రవి, స్వామిరాజు, గంగాధర్లతో పాటు ప్రోగ్రాం అధికారి నగేష్, అధ్యాపకులు వనజ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

» ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మార్మాట్

ఉట్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉట్నూర్ సమగ్రగిరిజన అభివృద్ధిసంస్థ ప్రాజెక్ట్‌అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సి పాఠశాలను తనిఖీ చేసి రిజిస్టర్‌లు, తరగతిగదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వపాఠశాలలు, సంక్షేమవసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతీరోజు మెనూప్రకారం పోషక విలువలుగల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన ఐరన్, సీ విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

తీసుకోవాలని, వసతి గృహ పరిసరాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటశాల, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు.

కోసాయి రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ఠ

(5వ పేజీ తరువాయి)

మన్నారు. రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన తాత్కాలిక మరుగుదొడ్లు ఏళ్ల తరబడి తెరుచుకోలేదు. వాటి నిర్వహణ లేక అంతా అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఒకటి, రెండుకు వెళ్లాలంటే చెట్ల పొదలే దిక్కవుతున్నాయి. రైల్వేస్టేషన్ చుట్టూ చెట్లపొదలు, చెత్తాచెదారంతో ఆ ప్రాంతం అంతా అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి నుంచి ఏ జంతువు వస్తుందోనని ప్రయాణికులు రాత్రి సమయంలో అనుక్షణంగా భయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైలు వచ్చేవరకు చెట్ల కిందనే కూర్చోవాల్సిన పరి స్థితులు నెలకొన్నాయి.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైలు

మండలంలోని కోసాయి రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైలు ఆడుతోందని, ఎక్స్‌ప్రెస్ రైలు ఆగడం లేదని నిరాశ కు గురవుతున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని కోసాయి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, నాందేడు నాగపూర్ ఇతర ప్రాంతాల ప్రాంతాలకు వెళ్లాలంటే జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని దాదాపు 20 గ్రామాల ప్రజలు ప్రయాణికులు సంబంధిత రైల్వేశాఖ అధికారులకు ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసాయిలో ఎక్స్‌ప్రెస్ రైలు ఆపితే రైతులు పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు, ఇతర దూరగా పట్టణ ప్రాంతాలకు వెళ్లే అవకాశం కలుగుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్‌గా రాజేశ్వర్



శ్రీనివాస్‌రెడ్డితో నూతన కన్వీనర్ రాజేశ్వర్, కోకన్వీనర్ దేవేందర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కన్వీనర్‌గా మదస్తు రాజేశ్వర్, కోకన్వీనర్‌గా నూకల దేవేందర్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ప్రకటించారు. ప్రెస్‌అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో వీరిని ప్రకటించారు. జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారానికి కృషిచేస్తామని ఈసందర్భం గా యూనియన్ నూతన కన్వీనర్ మాదస్తు రాజేశ్వర్ తెలిపారు. యూనియన్ నూతన కార్యవర్గానికి జిల్లా జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

నార్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదివాసీ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ అన్నారు. గురువారం గాదిగూడ మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు కనక ప్రభాకర్, మెస్రం గోవింద్, సిడాం బాపురం, పోలీస‌సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలానికి ఓ నిండు గర్భిణీ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని వన్‌వాట్ గ్రామానికి చెందిన అనితకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో రిమ్స్‌కు తరలించేక్రమంలో లోకారి గ్రామం వద్ద ఆమెకు నొప్పులు ఎక్కువై మార్గంమధ్యలోనే పైలెట్ రమేష్, ఈఎంపీ రవికుమార్ కుటుంబసభ్యుల సహకారంతో ప్రసవం చేశారు. వారిని ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తల్లి, బిడ్డను పరీక్షించి ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.

రైస్ మిల్లుల్లో అక్రమాలను బహిర్గతం చేయాలి

● సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

ఖానాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్, కడెం మండలాల్లో రైస్ మిల్లుల్లో జరుగుతున్న అక్రమాలను అధికారులు బహి ర్గతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంద ర్భంగా రైస్ మిల్లులో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా తరలించి సంబంధిత మిల్లుల యజమానులు కోట్ల రూపాయలను కొల్లగొట్టారని ఆరోపించారు. ధాన్యం తరలించే సమయంలో జిల్లాలోని అధికారులు సైతం సహకరించారని ఆరోపించారు. అధికారుల అండదండలతోనే రైస్ మిల్లులలో ధాన్యం అక్రమంగా తరలించడం సాధ్య మవుతోందన్నారు. అక్రమంగా ధాన్యాన్ని తరలించిన మిల్లుల యాజ మాన్యాలపై తూతూ మంత్రపు చర్యలు కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే సంబంధిత మిల్లులను సీజ్ చేయాలని, నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్య క్షులు దుర్గం లింగన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు గణేష్ పాల్గొన్నారు.

కాశీ అయోధ్యకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

నిర్మల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డిపో నుండి ప్రయాగ్ రాజ్, అయోధ్య, కాశీ యాత్ర బస్సు బయలుదేరిందని డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోధ్య, కాశీకి నిర్మల్ డిపో నుంచి వెళ్లడం ఇది రెండో బస్సు, అయోధ్య వెళ్లే భక్తులు ఆదరించడం వల్ల రెం డవ బస్సు నడపడం జరిగిందని ఇంకా చాలా మంది భక్తులు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని మరొక బస్సు నడపడానికి తేదీ నిర్ణయిస్తామని తెలిపారు. అలాగే నేడు అరుణాచలం, తిరుపతి బస్సు వెళ్తుందని ఆయన తెలిపారు. నిర్మల్ డిపో నుండి వివిధ దేవాలయాలకు, యాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నా మని ప్రయాణికులు ఆదరించా లని ఆయన కోరారు. త్వరలో పండరిపూర్, తుల్జాపూర్, కొలహాపూర్, భద్రాలచం, సింహచలం, అన్నవరం, రామేశ్వరం, శ్రీరంగం, కంచీపురం, అరుణాచలం, శబరిమల నడపనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆయన కోరారు.



అయోధ్య వెళ్తున్న ప్రయాణికులతో డిపో మేనేజర్ పండరి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కుంటాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో గురువారం టీ సార్ట్, గజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని హైస్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక సర్టిఫికేట్‌లను అందజేశారు. వీరు త్వరలోనే జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



భోల్సాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీడీవో

తానూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండలంలోని భోల్సా గ్రామంలో గురువారం ఎంపీడీవో శ్రీధర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరయిన లబ్ధిదారులకు వేగవంతంగా ఇంటి నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. గ్రామంలోని కాంగ్రెస్ యువనాయకులు సుదర్శన్, జంగు పోతన్న ఎంపీడీవోను శాలువతో సత్కరించారు. ఈయన వెంట ఈయన వెంట ఎంపీవో అమీర్‌ఖాన్, గ్రామ కార్యదర్శి వినయ్ ఉన్నారు.

శాన్విత చికిత్సకు ఆర్థిక సహాయం

- రూ. 28,500లు అందించిన రిక్రియేషన్ క్లబ్ సభ్యులు

నర్సాపూర్(జి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి శాన్విత చికిత్స కోసం ఉద్యోగులు ఉదారతగా స్పందించారు. 'చిన్నారిని ఆదుకోండి' అనే శీర్షికకు స్పందించి ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ సభ్యులు గురువారం ఆ చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ. 28,500లు ఆర్థిక సహాయాన్ని అందించారు. నిజమైన స్ఫూర్తితో ఉద్యోగులు ఒక చిన్నారి ప్రాణాన్ని నిల బెట్టడానికి ముందుకు రావడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా షిర్డీ సాయిబాబా శతక ఆవిష్కరణ

భైంసా రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో గురువారం సాయిబాబా మందిరం నందు సాయిబాబా శతక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... భక్తిని ప్రజలకు అందించడానికి ప్రజల క్షేమాన్ని కోరుకున్న సాయిబాబాపై శతకము డి. వినాయక రావు రాయడం చాలా సంతోషదాయకం. ఈ శతకము చదివిన, సాయిబాబా చరిత చదివినట్టు ఉంటుందని అన్నారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన

భైంసా రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాల్య వివాహాల చట్టంపై విజన్ ఆర్గనైజేషన్ సిహెచ్. అనురాధ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలి. అదేవిధంగా పిల్లలు చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలి. మొబైల్‌ను ఎక్కువ వాడకూడదు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యువత నష్టపోతున్నారు. చుట్టు పక్కల బాల్య వివాహాలు జరిగితే 1098కి ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

బోరుబావి తవ్వించిన భక్తుడు



ఆలయ ప్రాంగణంలో ఉచితంగా బోరుబావి వేస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పురాతన కదిలి పాప హరేశ్వర దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యం కోసం సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన వెంకటేశ్వర బోర్‌వెల్ యజమాని కృష్ణ దంపతులు ఉచితంగా బోర్ వేయించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు కృష్ణ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్వాడి పరుశురాం పటేల్, దిగంబర్ పటేల్, అర్చకులు సిద్దు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు

నిర్మల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారాలను దివ్యాంగుల వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పత్రిక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 12వ తేదీలోపు మహిళా శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గ్రామ పంచాయతీని సందర్శించిన ఎంపీవో

లోకేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎంపీవో సల్మాన్ రాజ్ సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. స్వచ్ఛత, పరిశుభ్రత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోకేశ్వరం మండల కేంద్రాన్ని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌కు సూచించారు.

ఆలయంలో ముగిసిన కాగడహారతి

కుబీర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న కాకడ హారతి కార్యక్రమం గురువారం ముగిసింది. గత పాల పౌర్ణమి నుంచి ఆలయంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నెల రోజుల పాటు ఆలయంలో వేకువ జామున నిర్వహించారు. ఈ హారతికి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల భక్తులు భారీగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు ప్రమోద్ మహరాజ్ ఆలయంలోని దేవతామూర్తులకు పంచామృత స్నానం నిర్వహించి నూతన వస్త్రాలను సమర్పించి హారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అష్టా గ్రామ బీసీ జేఏసీ కమిటీ ఎన్నిక

ముథోల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని అష్టా గ్రామ బీసీ జేఏసీ కమిటీని శుక్రవారం బీసీ జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షులుగా లోలం మురళి, ఉపాధ్యక్షులుగా సాకలి గంగాధర్, సురుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పోశెట్టి, కోశాధికారిగా శాల భోజన్న, ఉపకోశాధికారిగా ఎస్‌కే. మినాజ్, కార్యదర్శిగా అవుసలి ప్రసాద్, సలహాదారులుగా ఎస్‌కే. సాజిద్, ప్రశాంత్, నవీన్, రాఘవులు, సాయిరెడ్డి, గంగాధర్, చిన్నన్న, శంకర్, తిరుపతి, రత్నాకర్, ముత్యం, తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శత చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న దంపతులు

సారంగాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి ఆలయంలో పునఃవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం కుంకుమార్చన శత చండీయాగాన్ని వేద పండితులు మంత్రాలను చదువుతూ నిర్వహించారు. ఈ కుంకుమ అర్చనకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉప ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రతినిధులు

భైంసా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా కొనసాగుతున్న జూబ్లీహిల్స్ నియోజక వర్గ ఉప ఎన్నికల ప్రచారంలో ముథోల్ బీజేపీ ప్రతినిధుల బృందం పాల్గొంటోంది. గురువారం పార్టీ ముథోల్ నియోజక వర్గ ప్రతినిధి జీవీ రమణరావు నేతృత్వంలో బీజేపీ బృందం ప్రచారాన్ని చేపట్టింది.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

పెంబి, నవంబరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి గతంలో ఉన్న ముగ్గురు పిల్లల నిబంధనలను కాంగ్రెస్ పార్టీ తొలగించడంతో గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సుతారి రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోర్ల రాజన్న, తులాల శంకర్, గోరి పెద్దయ్య, లింగన్న, హేమ్లా నాయక్, రాము పటేల్, జేబు నాయక్, శేఖర్, సహదేవ్, తదితరులున్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుంటాల, నవంబరు, 6 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా (కే) గ్రామంలో గురువారం సోయా కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. రైతులు పండించిన పంటలు దళారులకు విక్రయించి మోసపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ఈ కొనుగోలు కేంద్రంలో సోయా విక్రయించిన రైతుకు క్వింటాలుకు 5328 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణ్, సిబ్బంది కృష్ణ మాజీ ఆత్మ చైర్మన్ సవ్వి అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు పటేల్, ఆత్మ డైరెక్టర్‌లు మహేందర్, గోనె గజ్జారాం, వీడీసీ అధ్యక్షులు సాయినాథ్, సభ్యులు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, సాయినాథ్, రాజు, మల్లారెడ్డి, మల్లేష్, నరేష్, పల్సి రాజన్న, దేవేందర్ రెడ్డి, ముత్యం రెడ్డి, యోగేష్, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ చేయూత

లోకేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అకాల మరణం పొందిన పిప్రి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దివంగత ఆర్. నారాయణకు పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వం కలిగి ఉన్నందున వారి కుటుంబానికి 1,00,000 రూపాయల చెక్కును పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర సంఘ పక్షాన వారి సతీమణి ఆర్. చంద్రకళకు, వారి కుమారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి. నరేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు మాట్లాడుతూ... వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి ఇకముందు కూడా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కే. రాజేందర్, ప్రధాన కార్యదర్శి జెట్ల రాజారాం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి. సురేష్ రావు, బర్ల చిన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్ రావు, వెంకట రమణ, మురళీధర్ పాల్గొన్నారు.

ఎండోమెంట్ కమిషనర్‌ను కలిసిన ఆలయ అధికారులు

బాసర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎండోమెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌ను గురువారం ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసారు. హైదరాబాద్‌లోని ఎండోమెంట్ కార్యాలయంలో ఆలయ ఈవో అంజనదేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్ కలిసి అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధితో చర్చించారు. ఆలయ మాస్టర్ ప్లాన్ పెండింగ్‌లో ఉందని అప్రూవల్ ఇవ్వాలని, కోరినట్లుగా ఈవో తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక కళాశాలల మూత



బోథ్‌లో మూతపడ్డ డిగ్రీ కళాశాల

బోథ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలను చెల్లించక పోవడంతో ప్రైవేట్ జూనియర్ డిగ్రీ కళాశాలలో మూత బడ్డాయి. అందులో భాగంగానే ఈనెల 3నుంచి మండల కేంద్రంలోని జూనియర్ డిగ్రీ కళాశాల నిరవధికంగా మూసివేస్తున్నట్లుయజమాన్యం వారు గేటుకు బ్యానర్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఇంటర్ డిగ్రీ విద్యకు దూరమవుతున్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందని ద్రాక్ష

నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాలలో ఇంటర్, డిగ్రీ విద్యనుచదివే వాళ్లంతా మారుమూల గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయం పనులలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. అయితే మారుమూల ప్రాంతాలలో నివసించే విద్యార్థులు ఒక వైపు ఇంటర్, డిగ్రీ చదువులు చదువుతునే కుటుంబాలకుబాసటగా నిలుస్తున్నారు. అయితే అనేక మంది పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలను నమ్ముకునిప్రభుత్వం ఇచ్చేరీయింబర్స్‌మెంట్ మీదఆధారపడి ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల కాకపోవడం యజమాన్యం వారు కళాశాల మూసి వేయడంతో చదువులు ఆటకెక్కనున్నాయి.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజురియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పలు విద్యార్థి సంఘాల వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాక విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఈ విషయంలో ఆందోళన వ్యక్త పరుస్తున్నారు.

క్రీడల ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం



» జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ » అట్టహాసంగా 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం

సోన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలో 11వ రాష్ట్రజోనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025-26 క్రీడా పోటీల కార్యక్రమం ప్రారం భోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జోన్‌పరిధిలో నాలుగు జిల్లాలకు చెందిన 1190 మంది విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొన బోతున్నారని తెలిపారు. క్రీడా స్ఫూర్తిని నిలబెడుతూ,ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. జీవితంలో గెలు పోటములు సహజమని, ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపు కోసం మళ్లీ ప్రయత్నిస్తూ, గెలుపొందిన వారు మరింత మంచి ఫలితాలు సాధించేలా పట్టుదలతో కృషి చేయా లన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని వివరించారు. బాలికలు, బాలురతో సమానంగా విద్యార్థి దశ నుంచే క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో పైచేయి సాధిస్తున్నారని తెలిపారు. ఇటీవల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేతగా భారత దేశ మహిళా జట్టు నిలవడం ఉదహరిస్తూ, బాలికలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని, ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకుంటూ క్రీడల్లో పాలుపంచుకోవాలని తెలిపారు.క్రీడల్లో భాగస్వామ్యం అవ్వడం ద్వారా పొందిన ధ్రువీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులువు అవుతుం దని చెప్పారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువును ఆపవద్దని, ఉన్నత చదువులు చదివిన వారికి ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ విషయాలు విద్యార్థులకు తెలి యజేసేలా పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. పోటీలలో పాల్గొనబోయే విద్యార్థులకు, కార్యక్రమ నిర్వాహకులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... క్రీడల్లో పాల్గొనబోయే విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆటలు ఆడాలని తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. గతంతో పోలిస్తే క్రీడల్లో బాలికల భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు.సీఎంకప్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని, గతంలో ఎన్నడే లేని విధంగా పతకాలు సాధించాలని గుర్తు చేశారు.అంతకు ముందు క్రీడా పోటీల్లో పాల్గొనబోయే వివిధ జిల్లాలకు చెందిన విద్యా ర్థులు, ఎన్‌సీసీ పరిచయ కవాతును నిర్వహించారు. జాతీయ జెండా, కార్యక్రమ జెండా లను కలెక్టర్, అదన పు కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. నిర్వాహకులు కలెక్టర్, అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. ఆతర్వాత తొలి రోజు నిర్వహిస్తున్న క్రీడలలో పాల్గొంటున్న విద్యార్థులను పరిచయం చేసుకొని వాలీబాల్ ఆడ టం ద్వారా క్రీడాకార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఐఈవో పరశురాం, డివైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ మల్లేష్, ఇతర అధికారులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్మల్ జిల్లా కలెక్టర్



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజా వేదికలో బయటపడ్డ పలు అక్రమాలు

» ముథోల్ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్
» పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి రికవరీ పెనాల్టీకి ఆదేశించిన డీఆర్‌డీవో



ముథోల్‌లో ప్రజా వేదిక

ముథోల్,నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో చేపట్టిన 15 విడత ప్రజా వేదిక కార్యక్రమంలో పలు అక్రమాలు బయటపడ్డాయి. ఈ ప్రజా వేదికకు డీఆర్‌డీవో విజయలక్ష్మి హాజరయ్యారు. మండల పరిధిలో మొత్తం 19గ్రామ పంచాయతీలకుగాను ఈజీఎస్ ద్వారా 290 పనులకు గాను రూ.4,79,62,997లు అలాగే పీఆర్ ద్వారా 100 పనులకుగాను రూ. 3,97,59,675లపై సామాజిక బృందం ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. ఇందులో పీఆర్‌కు సంబంధించిన 91 శాతం రికార్డులు సామాజిక బృందానికి అందుబాటులో లేకపోవడంతో 9 శాతం ఉపాధి హామీ పథకానికిసంబంధించిన 100శాతం నిర్వహించిన సర్వేకు సంబంధించి ప్రజా వేదికలో వెల్లడించారు. అయితే ఈ ప్రజావేదికలో పలు అక్రమాలు బయటపడ్డాయి. గ్రామాల్లో ఉపాధి హామీ పనికి వెళ్లకున్న వెళ్లినట్టు హాజరు వేసి డబ్బులు లేపడం, పనికి వెళ్లకున్న సంతకాలు పెట్టి డబ్బులు తీసుకోవడం, ఎంబీలో నమోదు లేకుండా డబ్బులు లేపడంతో పాటు మాస్టర్లను దిద్దుబాటు చేయడం, ఒక దగ్గర చేయాల్సిన పని మరొక దగ్గర చేయడం, ఒక్క కుటుంబం పైనే రెండు జాబ్ కార్డులు ఏర్పాటు చేసి డబ్బులు లేపడం వంటి అక్రమాలు బయటపడ్డాయి. మేట్లు కూలీ వద్ద వారానికి రూ. 100 చొప్పున తీసుకోవడం జరిగిందని తనిఖీ బృందం వెల్లడించింది.ప్రధానంగా ముథోల్ జీపీలో ఎక్కువ అక్రమాలు జరగడంతో ఫీల్డ్ అసిస్టెంట్ సోనీని సస్పెన్షన్ చేసినట్లు డీఆర్‌డీవో తెలిపారు. అంతేకాకుండా మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు కలిపి ఫీల్డ్ అసిస్టెంట్ లకు, సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు రూ. 73,194 రికవరీ, రూ. 14,000ల పెనాల్టీ డీఆర్‌డీవో వేశారు. కేవలం ముథోల్ గ్రామ పంచాయతీకి సంబంధించి రూ. 62,741 రికవరీ, రూ. 7,000ల పెనాల్టీ వేశారు. అంటే ముథోల్ జీపీ పరిధిలో ఎక్కువ అక్రమాలు జరిగాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో జరిగినట్లు తెలిపారు. పూర్తి విచారణ జరిపి బాధ్యు లపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.డీఆర్డీవో ఉపాధి హా మీ సిబ్బందిపై మండిపడ్డారు. పనులను పారద ర్శకంగా చేయించాలి కానీ నిర్లక్ష్య వైఖరితో చేస్తే ఎవరిని సహించేదిలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం అశోక్, ఎస్‌టీఎం దత్తు, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీవో లవ కు మార్, ఏపీవో శిరీషారెడ్డి, ఎంపీవో శివ కుమార్, ఎస్ఆర్‌పీ మహేష్, డీఆర్‌పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు,కూలీలు, గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెంతకు తాగునీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నీళ్లు పట్టుకుంటున్న విద్యార్థులు

ఉట్నూర్,నవంబరు6 (ఆంధ్రజ్యోతి): దాహంవేస్తే ఇంటికే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తతో తమ పాఠశాల విద్యార్థుల కష్టాలు గట్టుఎక్కాయని పేర్కొంటూ పాఠశాల హెచ్ఎం బండివిజయ్ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 30న వార్త వచ్చిన వెంటనే మండల విద్యాధికారితో పాటు గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీడీఓ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్య తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్నబోరుబావి పూర్తిగా కూరుకు పోవడంతో అరకిలో మీటర్ దూరంలో ఉన్న మత్తడిగూడ గ్రామంలోని బోరుబావి మోటార్ బిగించి పాఠశాల వరకు పైపులైన్ వేసి నల్లాను గురువారం బిగించడంతో విద్యార్థులు, మధ్యాహ్నం భోజనంవర్కర్‌లు సంతోషం వ్యక్తం చేశారు.ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాన్ని చూసి అధికారులు స్పందించి చర్యలు తీసుకునేలా చేసిన 'ఆంధ్రజ్యోతి'దినపత్రికకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని హెచ్‌ఎం తెలిపారు.

అటవీ ప్రాంత ప్రజలందరికీ మెరుగైన వసతులు కల్పించాలి : నిర్మల్ జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ ప్రాంత ప్రజలందరికీ మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లాస్థాయి అటవీ కమిటీ (డీఎల్‌సీ)సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా, మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని చెప్పారు. మెరుగైన వసతుల కల్పన ద్వారా అటవీ ప్రాంత ప్రజల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మెరుగైన రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా జిల్లా కేంద్రానికి, మండలానికి కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తమ పరిధిలో ఉన్న అటవీ అధికారులు శాఖాపరమైన అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వాలన్నారు. అనంతరం మాట్లాడుతూ.. పీవీ టీజీ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులను తొలగించాలన్నారు. అవసరమైతే రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎఫ్‌వో నాగిని భాను, ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీవో శ్రీనివాస్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్.సుదర్శన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ ఇసుక



డంపు చేసిన ఇసుక

» ఒక్కటే చలాన్ ఎన్నిసార్లయినా తోడుకో
» ఫిర్యాదు చేసినప్పుడే హడావిడి తర్వాత అంతా మామూలే
» కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు
» కోట్లలో ప్రజాధనం వృథా



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌రూరల్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలో అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతుంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం అక్రమ ఇసుకదందా చేసే వారికి వరంగా మారింది. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుక తీసుకుంటున్నట్లు అధికారుల దగ్గర రాయించుకొని ఇసుకను ఇతర గ్రామాలకు జిల్లాకేంద్రాలకు తరలించుకుని ఇష్టారాజ్యాంగ అధికధరలకు అమ్ముకుంటున్నా రు.

ఒక్కటే చలాన్

కొందరు చలాన్‌లు కట్టి ఇసుక తీసుకుంటున్నామని బుకాయిస్తున్నారు. ఒక్క టోకెన్ మీద రోజుల తరబడి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. దీన్ని పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు తాము గ్రామపంచాయతీ జీపీఓ అధికారులకు ఇందిరమ్మ ఇసుకను వివరాలను పరిశీలిం చాలని తెలిపమని వారు ఇసుకకు సంబంధించిన విషయాలను పర్యవేక్షిస్తున్నారని అంటున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో దీనికి పూర్తి విరుద్ధంగా కనబడుతున్నాయి. గ్రామాల్లో ఈ ఇసుక రవాణాలను పర్యవేక్షించాల్సిన జీపీఓ అధికారులు తమకేమీ పట్టనట్లు అటువైపు కూడా వెళ్లదేం దని గ్రామాల్లో ప్రజలు గుసగుసలాడుతున్నారు.ఈవిషయంపై అధికారులను వివరణ కోరగా సిబ్బంది లేరనో అధిక పని భారం వల్లనో చెప్పిఅధికారులు తప్పించుకొని తిరుగుతున్నారు.

ఏజెన్సీల్లో అదే పరిస్థితి..

ఏజెన్సీప్రాంతాల్లోపర్యవేక్షించాల్సిన అటవీ అధికారులు కూడా చూసి చూడనట్టు మామూలుగానే తీసుకుంటున్నారని ఏజెన్సీ గ్రామాల్లో పలు అనుమానాలు వ్యక్తం అవు తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



ఇందిరమ్మ ఇసుక విషయంలో గ్రామ పంచాయతీల్లో జీపీఓలకు ఈబాధ్య తలు అప్పజెప్పాం. ఇసుక అక్రమ రవాణా మాదృష్టికి రాలేదు.ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటాం.

- గోవింద్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

క్రైం సమాచారం

కన్న కొడుకుని చంపిన తండ్రి



కొల్లడ్ రాజు(ఫైల్)

తానూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తానూర్ మండల కేంద్రలో బుధవారం రాత్రి కన్న కొడుకుని తండ్రి చంపిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లడ్ రాజు(31) మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవపడుతుండే వాడు బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవలు పడడంతో విసుగు చెంది మృతుడి తండ్రి లాలన్న, మృతుడి చిన్నాన్న లక్ష్మణ్‌లు ఇద్దరు కర్రలతో కొట్టడంతో రాజుకు తీవ్రగాయాలవడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి, మృతుడి చిన్నాన్న పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మృతునికి కొడుకు, కూతురున్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్ (ఆదిలాబాద్‌టౌన్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లికి నిరాకరించి యువతీ ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి సీఎం రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన ప్రణీష రిమ్స్ పారామెడికల్ కళాశాలలో చదువుతూ ఆదిలాబాద్ న్యూరో హాస్పిటల్‌లో పని చేస్తుండేది. కజ్జర్ల గ్రామానికి చెందిన నిందితుడు ఉప్పారపు శ్రీనివాస్ తనను ప్రేమించి పెండ్లికి నిరాకరించడంతో 2023లో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరిపారు. ఎస్సై హరిబాబు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా..లైజన్ అధికారి వెంకటమ్మ, కోర్టుడ్యూటీ అధికారి అశోక్‌లు పదిమంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ షాహినా సుల్తానా నేరాన్ని రుజువు చేయడంతో, అసిస్టెంట్ అసోసియేషన్స్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఐదువేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్ (జి)మండలంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు గాయపడ్డారు. నిర్మల్ నుంచి నర్సాపూర్(జి)ఆశ్రమ పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఉపాధ్యాయులు సుదర్శన్,రాజేశ్వర్ నసిరాబాద్ సమీపంలోకి రాగానే అకస్మాతుగా ఒక కుక్క రోడ్డుకు అడ్డు వచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడు సుదర్శన్ చేయి విరిగిపోగా, రాజేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుంది. అంబులెన్స్ సిబ్బంది అయిన ఈఎంటీ సృజన్, పైలెట్ రణవీర్ గాయపడిన టీచర్లకు తక్షణమే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానికులు, పోలీసులు సకాలంలో స్పందించడం వల్ల గాయపడిన ఉపాధ్యాయులకు సకాలంలో వైద్య సహాయం అందింది.

నీటి కుంటలో పడి ఒకరి మృతి

సోన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామానికి చెందిన మూడ సాయవ్వ(47) గ్రామ శివారులో గల నీటికుంటలో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నీటికుంటలో మునిగి ఊపిరి ఆడక చనిపోయింది. మృతురాలి కొడుకు మూడ సాయన్న ఫిర్యాదు మేరకు ఎస్సై గోపి కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్ (ఆదిలాబాద్ టౌన్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాల కారణంగా తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని,ఆరోగ్యం, విద్య, సామాజికపరంగా నష్టపోయే ప్రమాదం ఉందని శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర అన్నారు. బాల్య వివాహ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా గురు వారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మహిళా, శిశుసంక్షేమ, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహం చట్టం, బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలు, అత్యవసర టోల్‌ఫ్రీ నం బర్ల గురించి అవగాహన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవ గాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, పాఠశాల హెడ్ మాస్టర్ సాజీల బేగం, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సఖి కేంద్రం అడ్మిని స్ట్రేటర్ లావణ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, ష్యూర్ ఎన్‌జీఓ కోఆర్డినేటర్ వినోద్, సిబ్బంది సౌజన్య పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన అత్యవసరం : సీఐ

బజార్‌హత్నూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన సందర్భంగా సైబర్‌క్రైమ్‌పై ప్రతీ ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగాహన అత్యవసరమని బోథ్ సీఐ గురుస్వామి అన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై సంజయ్ కుమార్‌తో కలిసి విద్యార్థులకు సైబర్ నేరాలపైన పూర్తిస్థాయిలో అవగాహనను కల్పించారు.ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లికార్జున వైన్ షాపులో చోరీ

ఇంద్రవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామం సమీపంలో గల మల్లికార్జున వైన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.99వేల మందులను దొంగిలించారని ఎస్సై .సాయన్న గురువారం విలేకరులకు తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాలప్రకారం మల్లికార్జున్ వైన్‌షాపులో సేల్స్‌మ్యాన్‌గా పని చేస్తున్న పూరిలక్ష్మీకాంత్ బుధవారం రాత్రి 9.30 గంటలకు వైన్ షాప్ బంద్ చేసి ఇంటికి వెళ్లాడని, తిరిగి గురువారం ఉదయం 10.30 గంటలకు వైన్ షాపు తెరిచి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు వెనుక వైపు నుంచి గోడకురంధ్రం చేసి షాపులో చొరబడి రూ.99,760 విలువ గల మద్యాన్ని దొంగిలించినట్లు తెలిపారు. వైన్ షాప్ సేల్స్ మ్యాన్ మల్లికార్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌డ్యామ్‌ల ద్వారా భూగర్భ జలాల పెంపు



పాచ్చెరలో పెద్దవాగుపై చెక్‌డ్యామ్



సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే (ఫైల్)

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపు కోసం మండలంలోని పెద్దవాగు పైన ఐదు చోట్ల చెక్‌డ్యాముల నిర్మాణం చేపట్టడం జరిగింది. అయితే పెద్దవాగు నుంచి పారే నీటిని చెక్‌డ్యామ్‌ల ద్వారా నిలుపుదల చేసి నిలువ ఉన్న నీటిని సాగునీటిగా వినియోగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఊహించిన దానికంటే ఎక్కువ నిలువ

పెద్దవాగు పైన నిర్మించినచెక్‌డ్యాములలో నీటి నిల్వ ఊహించిన దానికంటే అధికంగా ఉండడంతో ఆ నీటిని వృధా కానీయకుండా సాగునీటిగా వినియోగించాలన్న దృక్పథంతో అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. అయితే నియోజకవర్గం పరిధిలోని బోథ్ మండలంలోని వివిధ వాగుల ద్వారా నీరు వృథాగా పోతున్న ఆ నీటిని వినియోగించుకోవడంలో రైతులు విఫలమవుతున్నారు. అయితే నిండుకుండలా ఉన్న చెక్‌డ్యాములను చూసిన అధికారులు చెక్‌డ్యామ్‌లో నిండిన నీటిని సాగునీటిగా వినియోగించాలని ప్రతిపాదనలను పంపించారు. దీంతో ఈదిశగా అధికారయంత్రం అడుగులువేస్తున్నది.

సర్వే పూర్తి ప్రతిపాదనలు సిద్ధం

చెక్‌డ్యాముల ద్వారా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అధికారులు ఎన్ని వేల ఎకరాలకు నీరు అందుతుందన్న సర్వేను చేపట్టారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దాదాపు రెండు వేలపై చిలుకు ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు చర్యలు చేపట్టారు.

నిధులు మంజూరు చేస్తాం:ఎమ్మెల్యే

చెక్‌డ్యామ్‌ల ద్వారా నియోజకవర్గ పరిధిలో 3000పై చిలుకు ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని స్థానికశాసన సభ్యులు అనిల్ పేర్కొన్నారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి రైతులకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపడతామన్నారు.రబీ పంట కోసం నీరు అందించాలన్న దృక్పథంతో ఉన్నామన్నారు.

సమ్మె విరమించిన జిన్నింగ్ మిల్లుల యజమానులు



భైంసాలోని తూకం వేస్తున్న పత్తి

» యథా విధిగా జరిగిన పత్తి కొనుగోళ్లు



పత్తి దిగుబడులను ఖాళీ చేస్తున్న దృశ్యం

భైంసా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల నెరవేర్చుకునేందుకు జిన్నింగ్ మిల్లుల యజమానులు గురువారం నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మెను విరమించుకున్నారు. దీంతో గురువారం జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోళ్లు యదావిధిగా కొనసాగాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఎంపిక ప్రక్రియలో ఎల్ 1 , 2 , 3 నిబంధనను తొలగించాలని, స్లాట్ బుకింగ్ విధానం, కిసాన్ కపాస్ యాప్ ఎత్తివేయాలని, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి కాకుండా ఇది వరకటి లాగా 12 క్వింటాళ్లను కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో గురువారం నుంచి జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు ఉపక్రమించారు. అయితే సంబంధిత డిమాండ్లు నెరవేర్చేందుకు గాను రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావ్ బుధవారం రాత్రి రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల యజమానుల అసోసియేషన్‌కు ఇచ్చిన హమీ మేరకు సమ్మె విరమించినట్లుగా భైంసా జిన్నింగ్ మిల్లుల యజమానుల సంఘం అధ్యక్షుడు ఓం ప్రకాష్ లడ్డా వెల్లడించారు. రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు సమ్మెను విరమించి గురువారం నుంచి కొనుగోళ్లను యదావిధిగా చేపట్టినట్లుగా వివరించారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 4 జిన్నింగ్ ఫ్యాక్టరీలలో సీసీఐ కొనుగోలు కేంద్రాలలో , 5 ప్రైవేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇక్కడి మార్కెట్ కమిటీ పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 10 వేల క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోళ్లు జరిగినట్లుగా మార్కెట్ కమిటీ అధికారులు వెల్లడించారు.





అధ్యాపకులతో చర్చిస్తున్న డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్

కళాశాలను సందర్శించిన డీఐఈవో

ఇచ్చోడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో జాదవ్ గణేష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిలబస్ త్వరితగతిన పూర్తిచేయాలని, విద్యార్థుల హాజరుశాతంపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. అనంతరం కళాశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

'కపాస్ కిసాన్‌యాప్‌తో రైతులకు ఇబ్బందులు'

బోథ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం తెచ్చిన కపాస్ కిసాన్‌యాప్‌తో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, యాప్‌ను వెంటనే రద్దు చేయాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.గంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌తో అనేకమంది నిరక్షరాస్యులైన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే కిసాన్‌యాప్‌ను రద్దు చేయాలని కోరారు. రైతు పండించిన పంట అమ్ముకునేందుకు నిబంధనలు పెట్టడం సరికాదని అన్నారు. సాగు సమయంలో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులు పంట అమ్మేందుకు కపాస్ కిసాన్ యాప్‌తో ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు.

బీసీ రిజర్వేషన్‌లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు

» బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దత్తు

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లపై ప్రభుత్వాలు రెండు నాలుకల దోరణిని అవలంబిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు ఆరోపించారు. గురువారం బీసీ సంఘం పిలుపుమేరకు ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలోని మహాత్మపూలే, అంబేద్కర్ విగ్రహాల ఎదుట మౌనదీక్ష చేపట్టారు. ముందుగా మహనీయుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం నోటికి నల్లగుడ్డలు కట్టుకొని ప్రభుత్వాల తీరును ఎండట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ఇచ్చి 9వ షెడ్యూల్ పెట్టాలన్నారు. రిజర్వేషన్‌లు లేని కారణంగా ఉపాధి, రాజకీయరంగాల్లో రాణించలేకపోతున్నారన్నారు. రిజర్వేషన్లు ప్రకటిస్తే అన్నిరంగాల్లో బీసీలు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్, గౌవర అధ్యక్షుడు నర్సాగౌడ్, కోశాధికారి అంజన్ కుమార్, చందు, కాసర్ల శ్రీనివాస్, సంతోష్, విజయ్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'హలో ఆదివాసీ చలో ఉట్నూర్' ధర్మయుద్ధ పోస్టర్లు విడుదల

ఉట్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'హలో ఆదివాసీ.. చలో ఉట్నూర్' ధర్మయుద్ధ పోస్టర్లను తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్తి దాదిరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. గురువారం ప్రెస్ భవన్ ఆవరణలో తుడందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉట్నూర్‌లో నిర్వహించనున్న ధర్మయుద్ధం పోస్టర్లను విడుదల చేసిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పెందూరుగాంధీరావు, ఉమ్మడిజిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గుపటేల్‌లు మాట్లాడుతూ చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో ఈనెల 23న చలో ఉట్నూర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆదివాసులు పెద్దమొత్తంలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తుడందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడంగ జేష్, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెందూరుపుష్పారాణి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నగేష్, తుడందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పుర్కబాపురావు, ఆదివాసీ సంఘాల నాయకులు గేడం మారుతి, బొంత ఆశరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరించిన తుడందెబ్బ ప్రతినిధులు



కోసాయి రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ఠ



తుప్పు పట్టిన కుర్చీలు



రైల్వేస్టేషన్‌లో చెత్తాచెదారం

» స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కరువు
» అవస్థలు పడుతున్న ప్రయాణికులు
» ప్యాసింజర్ రైళ్లకే పరిమితం
» రైల్వేస్టేషన్‌లో ఆగని రైలు
» ఆపాలని విన్నవించినా పట్టించుకోని రైల్వే అధికారులు

తలమడుగు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల కోసాయి రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. మౌలిక వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మౌలికవసతులు కల్పిస్తున్నామని రైల్వేశాఖ అధికారులు చెప్తున్నా అమలుకు నోచుకోవడంలేదు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోగల కోసాయి రైల్వేస్టేషన్ గత దశాబ్దాల క్రితం నిర్మించారు. దాదాపు 15 నుంచి 20 గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతీరోజు వందలాది మంది ప్రయాణికులు ఇక్కడినుంచి దూరప్రాంతాలకు వెళ్తుంటారు. కోసాయి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీసమౌలిక వసతులైన తాగునీటి వసతిలేదు. మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు.

చీకట్లోనే రైల్వే స్టేషన్

రైస్‌స్టేషన్‌లో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి వేళలో ప్ర యాణికులు చీకట్లో ఎటూ వెళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, కొండ ప్రాంతం దగ్గర ఉండడంతో స్టేషన్‌లోకి అడవి పందులు, ఎలుగుబంట్లు ఇతర జంతువులు వస్తున్నాయని రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. తరుచూ జంతువులు రావడంతో రాత్రి ప్రయాణం అంటేనే భయపడాల్సిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయన్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్లో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, పిల్లలు అత్యవసర సమయంలో మరుగుదొడ్లకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాని (మిగతా 6వ పేజీలో..)

మౌలిక వసతులు కల్పించాలి

● వెంకట్ యాదవ్, ప్రయాణీకుడు, దేగామా



కోసాయి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస మౌలిక వసతులు కల్పించాలి. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు తక్షణమే ఏర్పాటు చేయాలి. స్టేషన్ నుంచి గ్రామాల వరకు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

● ఎర్మా గోపాల్, మాజీ సర్పంచ్, ఉమ్రి



కోసాయి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆపితే ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారులకు విన్నవించాం. అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైలును పాలని కోరారు.

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరికి 20ఏళ్ల జైలు

» ఒక్కొక్కరికీ రూ.10వేల జరిమానా
» నేరానికి సహకరించిన ఒకరికి 3నెలల జైలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): బాలికను అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులకు 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి డాక్టర్ పి.శివరాం ప్రసాద్ తీర్పు ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ బాలికపై ఇంగోలే అనిల్, ఇంగోలే గంగాధర్ అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమె మెడపై కొట్టి ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించారు. ఈ కేసును ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై సయ్యద్ ముజాయిద్ నమోదు చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి సాక్షులను విచారించి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా, నేరానికి సహకరించిన దుపత్రే సుష్మకు 3నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు. నేర నిర్ధారణకు కృషిచేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

టోకెన్ల కోసం రైతులకు తిప్పలు



టోకెన్ల కోసం పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన రైతులు

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మొక్కజొన్న, సోయాబీన్ పంటల విక్రయానికి టోకెన్లు అవసరం కావడంతో రైతులు సహకార సంఘం కార్యాలయం వద్ద టోకెన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సరిగా పనిచేయక పోవడంతో రైతులు గం టల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో కొంత ఆలస్యం అవుతున్నట్లు స్థానిక సీఈఓ గోలిస్వామి తెలిపారు. రైతులు సంయమనం పాటించాలని కోరారు.

గుంతల పూడ్చివేత

బోథ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రమాదకరంగా మారిన రోడ్డుపై గుంతలను సామాజిక సేవలు గురువారం పూడ్చారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుంతలను పూడ్చినట్లు వారు పేర్కొన్నారు. గుంతలను పూడ్చిన స్వచ్ఛంద సేవకులు షేక్ ఆలీ పురుషోత్తం, గుడిసెల రమణగౌడ్, సురేష్, వైద్య, అల్లకొండ పోతన్న, అబ్దుల్, కోల ప్రశాంతులను పలువురు అభినందించారు.

గుంతలు పూడ్చిన మార్నింగ్ వాకర్స్

సోనాల మండలం మీదుగా బజార్‌హత్నూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో గురువారం ఉదయం మార్నింగ్ వాకర్స్ రోడ్డు పైన ఉన్న భీమన్న విడిచి వద్ద ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలను సోనాల మార్నింగ్ వాకర్స్ పూడ్చివేశారు. మార్నింగ్ వాకర్స్ తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రైతులకు న్యాయం జరిగేవరకు ఉద్యమిస్తాం: మాజీ మంత్రి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో శాంతియుతంగా ధర్నా చేస్తే తనపై, పార్టీ కార్యకర్తలపై అక్రమకేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ ఇంటి వద్ద శాంతియుత నిరసన తెలిపేందుకు ప్రయత్నించామని, అయినా పోలీసులు తమను అరెస్ట్ చేసి కేసులు పెట్టారని అన్నారు. రైతులకు అండగా ఉండాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. సీసీఐ నిబంధనలు సడలిస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగుల డీఏపీఆర్సీలను ప్రకటించాలి



మాట్లాడుతున్న డీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ములుగు శామ్యూల్

ఉట్నూర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ సభ్యులు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి ముదుగు శామ్యూల్ హెచ్చరించారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే రెండు దశల ఉద్యమాలు ప్రకటించాల్సి వస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావస్తున్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికే తెలంగాణ ఎంప్లాయిస్‌పక్షాన, ఉపాధ్యాయసంఘాల యూఎస్పీసీగా ఏర్పడి ఉద్యమాలు చేశామన్నారు. స్పందించిన ప్రభుత్వం అధికారులతో ఒక కమిటీని, మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన సమస్యలు కొలిక్కి రాలేదన్నారు. 2023 జూలై నుంచి రావాల్సిన పీఆర్సీ ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్ సి.వీరయ్య, బండి రాజారాం, రాథోడ్‌రవిత, రవిచందర్‌గౌడ్, లావుడియా సుజాత, కె.మమత, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

» పీవీటీజీ ఏపీఓ దామోర స్వామి



మాట్లాడుతున్న ఏపీఓ, పీవీటీజీ దామోదర స్వామి

ఉట్నూర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి మన్నే తెగలను ప్రభుత్వం పీవీటీజీలుగా గుర్తించి అనేక సంక్షేమ కార్యక్రమాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని ఐటీడీఏ ఇన్‌చార్జీ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జీపీవీటీజీ ఏపీఓ దామోదర స్వామి అన్నారు. గురువారం మండలంలోని కోలాం గిరిజనుల నివాస ప్రాంతాలైన దొంగచింత, కుమ్మరికుంట గ్రామాలను యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం లీడ్, ఢిల్లీ ప్రతినిధి వందనపాల్, యాక్షన్ ఎయిట్ ప్రోగ్రాం హెచ్‌ఆర్‌డీ మర్సుకోల సరస్వతీలను ఆదివాసీ గిరిజనులు తమ సంప్రదాయ వాయిద్యాలు, దింస నృత్యంతో స్వాగతం పలికారు. ముందుగా దొంగతచింత గ్రామంలో ఉన్న ఆదివాసీ అమరులు కొమురంభీం, కుమ్రసూరు విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం కుమ్మరికుంట చేరుకున్న అధికారులకు కోలాం గిరిజనులు భారీ స్వాగతం పలుకుతు హనుమాన్ మందిరానికి ఆహ్వానించారు. దామోదరస్వామి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుమ్మరికుంట గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన సీసీడీపీ పథకం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని కోలా గిరిజనులలో ఒంటరి మహిళల సంక్షేమానికి విద్య అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పటేల్ ముకుందరావు, పీవీటీజీ ఏపీఓ డాక్టర్ మేస్రం మనోహార్, యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం జిల్లా పీవో మర్సుకోల, ఉట్నూర్ కో ఆర్డినేటర్‌కుమ్రశ్రీదేవి, ఆదివాసీ నాయకులు మర్సుకోల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

10న కోటి దీపోత్సవం

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు సంతోష్ శర్మ తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక మార్వాడి ధర్మశాల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టనున్న కోటి దీపోత్సవ కార్యక్రమానికి ఆయన గురువారం స్థలాన్ని పరిశీలించారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రితోపాటు సభ్యులు స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. కోటి దీపోత్సవానికి మహిళలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని అన్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమర్‌నాథ్ మాదిరిగా మంచులింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, కోశాధికారి రేణుకుంట రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుల రవీందర్, నర్సేజీ, రాజు, శ్రీనివాస్, శశికళ, మాలతి, రమ, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

నేరడిగొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని, లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు ముందుకు సాగాలని మండల విద్యాశాఖ అధికారి భూమారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బాల బాలికలకు ఉపన్యాసం, క్విజ్, వ్యాసరచన పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో తేజాపూర్, వడూర్, వాంకిడి జిల్లాపరిషత్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఎస్‌వో రజిత, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మణిలత, వివేకానంద, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న డీఎఫ్‌వో

తలమడుగు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామిని కార్తీక్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా ఫారెస్టు అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఘనంగా తులసీ కల్యాణం

తాంసి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం సైతం తులసీ మాత కల్యాణ నిర్వహించారు. తులసమ్మకు, జమ్మి చెట్లులకు కంకునాలు కట్టి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం వారి ఇళ్లల్లో తీపి వంటకాలు చేసుకొని ఆరగించారు. ఇళ్లను పూలతో, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నేరడిగొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ సద్దాం అన్నారు. గురువారం మండలం లోని గుత్పల గ్రామంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ సంతోష్ ,హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రైతులకు మద్దతు ధర కల్పించేందుకే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

నార్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర కల్పించేందుకే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముకాడే ఉత్తం, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎస్‌ఎస్‌ఆర్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ సోయం మారుతి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌ఎస్‌ఆర్ జినింగ్ డైరెక్టర్ నిలేష్ రాథోడ్, మాణిక్ రావు, జ్ఞానోబా పుష్కర్, సురేష్ ఆడె,కాంతా రావు దూర్వే, బ్రిజిలాల్, కైలాష్ జాదవ్ సుల్తాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరయమయ్యేలా చూడాలని, ఆ దిశగా పోలీసులు, అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో గురువారం ఆయన మీడియా మాట్లాడారు. ఈనెల 15న లోక్‌అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో రాజీపడదగ్గ కేసులను పరిష్కరిస్తామన్నారు. క్రిమినల్,సివిల్, భార్యాభర్తల తగాదాలు, మోటార్ ప్రమాదం పరిహారాలు, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

'ఆర్మీ జవాన్ ఇంటిని సీజ్ చేయడం సరికాదు'

ఇంద్రవెల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మెండపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కుంటాల నర్సయ్యకు చెందిన ముత్నూర్ గ్రామంలోని ఇంటిని అధికారులు సీజ్‌చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. గురువారం ఆర్మీజవాన్ ఇంటిని అధికారులు సీజ్‌చేయడంపై దానికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆందారే బాలాజీ మాదిగ, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు రాంప్రసాద్, తదితరులు ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తహ

ఇంద్రవెల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నోర్(బి) గ్రామంలో 7 రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. హరినామ సప్తహ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని విఠోబా రుక్మిణి ఆలయంలో కాకడహారతితోపాటు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో విఠోబా పల్లకీసేవ శోభయాత్ర, అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ స్థులు సేండ్గే సతీష్, గేడం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

» ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఉట్నూర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): బాధితుల ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఉట్నూర్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా త్వరితగతిన సిబ్బందిని కేటాయించి పోలీసుల గౌరవం పెంచేలా విధుల చేపట్టాలని సూచించారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెంచేలా విధుల నిర్వహణ చేపట్టాలని రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు సక్రమంగా ఉండాలని, గస్తీ నిర్వహిస్తూ, నేరాల నియంత్రణ, పొగొట్టుకున్న సొత్తు రికవరీ చేయాలని అన్నారు. సిబ్బందిచే ప్రత్యేకంగా డ్రిల్ నిర్వహించి ప్రతీ శనివారం పెరడ్ నిర్వహించాలని, శారీరక ధృడత్వం శారీరక వ్యాయామం ఆరోగ్యానికి కీలకమని అన్నారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రీల్‌ను నిర్వహించి అత్యవసర పరిస్థితులలో శాంతిభద్రత సమస్యలు తలెత్తిన పరిస్థితులలో వ్యవహరించవల్సిన తీరును పరిశీలించారు. తదుపరి పోలీసుస్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పోలీసుస్టేషన్ సిబ్బందికి కేటాయించిన పోలీసు సామగ్రిని వస్తువులను వాటి నిర్వహణను పరిశీలించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటారు. పోలీసు స్టేషన్ అంతటా పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ బాధితుల ఫిర్యాదులపై దర్యాప్తు పూర్తిచేసి సరైన సమయంలోన్యాయం చేపట్టాలని తెలిపారు. రాత్రి సమయంలో ఫింగర్ ప్రింట్ యంత్రం ద్వారా తనిఖీ చేపట్టి అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించాలని సూచించారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు సమాచారాన్ని తెలుసుకుంటూ వీపీఓలు ప్రజారక్షణలో తమవంతు పాత్రపోషించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఉట్నూర్ ఎస్సై కె.ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.